గుట్టలో ఘనంగా నిత్య తిరుకల్యాణోత్సవం

యాదగిరిగుట్ట, అక్టోబర్ 17 : యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్ల నిత్య తిరు కల్యాణోత్సవం అత్యంత వైభవంగా సాగింది. గురువారం ప్రధానాలయం మొదటి ప్రాకార మండపంలో సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ అర్చకులు హోమం జరిపారు. స్వామి, అమ్మవార్లను గజ వాహనంపై వేంచేపు చేసి కల్యాణోత్సవ సేవ నిర్వహించారు. కల్యాణ మండపంలో తూర్పునకు అభిముఖంగా స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి నిత్య తిరు కల్యాణతంతు చేపట్టారు. లక్ష్మీసమేతుడైన నారసింహుడిని ఆరాధిస్తూ సుమారు గంటన్నరకు పైగా కల్యాణ తంతును జరుపగా భక్తులు పాల్గొని వీక్షించారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు జరిపారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం కన్నుల పండువగా చేపట్టి భక్తులకు నిజరూప దర్శనం కల్పించారు. సాయంత్రం స్వామివారికి వెండి మొక్కుజోడు సేవ, దర్బార్ సేవ ఆలయ మాడవీధుల్లో అత్యంత వైభవంగా సాగింది. ఉదయం, సాయంత్రం రెండు దఫాలుగా స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన నిర్వహించగా భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి స్వామి, అమ్మవార్ల శయనోత్సవ సేవ పాంచరాత్రగమశాస్త్ర రీతిలో కొనసాగింది. ప్రధానాలయం ముఖ మండపంలో అర్చకులు స్వామివారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా సువర్ణ పుష్పార్చన జరిపారు. దేవేరులను 108 బంగారు పుష్పాలతో అర్చించగా భక్తులు పాల్గొని తరించారు. పూర్వగిరి (పాతగుట్ట) లక్ష్మీనరసింహస్వామికి నిత్యారాధనలు శాస్త్రోక్తంగా సాగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.13,23,604 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

వైభవంగా శరత్ పౌర్ణమి వేడుకలు

దివ్యప్రబంధ పారాయణం గావిస్తున్న అర్చకులు, వేద పారాయణందారులు

యాదగిరిగుట్ట, అక్టోబర్ 17 : శరత్ పౌర్ణమి సందర్భంగా యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహ స్వామి ప్రధానాలయంలో ప్రత్యేక సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక సేవలను ఆలయ ముఖ మండపంలో వేంచేపు చేసి వేద విన్నపాన్ని గావించి, దివ్య ప్రబంధ పారాయణం ఆలకించారు. అనంతరం విశేష ప్రసాద వితరణ గావించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ప్రధానార్చకుడు కాండూరి వేంకటాచార్యులు, ఆలయ అర్చకులు, పురోహితులు, వేద పారాయణందారులు పాల్గొన్నారు.

కొండ కింద అన్యమతస్తుల ఆచారాలను తొలగించాలని వినతి

యాదగిరిగుట్ట స్వామివారి పాదాల వద్ద జంతు వధలో అన్యమతస్తుల ఆచారాలను తొలగించాలని యాదగిరిగుట్ట పట్టణానికి చెందిన భక్తులు గురువారం ఆలయ ఈఓ భాస్కర్‌రావుకు వినతి పత్రం అందజేశారు. స్వామివారికి మేక బలి ఆచారం తరతరాలుగా వస్తున్నదని, కానీ.. మేకలను ముస్లింల పద్ధతిన హలాల్ చేస్తున్నారని తెలిపారు. అక్కడ హలాల్‌ను రద్దు చేయాలని కోరారు. స్పందించిన ఈఓ వెంటనే హలాల్ పద్ధతిని రద్దు చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్ముకోవాలి

- డీఏఓ గోపాల్

ఇస్రాయిపల్లికుంట వద్ద పొలాన్ని పరిశీలిస్తున్న డీఏఓ గోపాల్

బీబీనగర్, అక్టోబర్ 17 : రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్ముకుని మద్దతు ధర పొందాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోపాల్ అన్నారు. మండలంలోని ఇస్రాయిపల్లి కుంట వద్ద గురువారం వరి పొలాలను పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వం సన్న రకం ధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లిస్తుందన్నారు. వ్యవసాయ అధికారులను సంప్రదించి విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు వాడాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని ఆర్‌సీఎస్ ఫార్మ్స్ షాప్‌ను సందర్శించి ఎంఆర్‌పీ రేట్లకే పురుగు మందులు, ఎరువులు, నాణ్యమైన విత్తనాలు అమ్మాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ పద్మ, ఏఈఓ ఉమామహేశ్వరి, రైతులు పాల్గొన్నారు.

కొనసాగిన ప్రైవేట్ డిగ్రీ కళాశాలల బంద్

- భువనగిరిలో బైక్ ర్యాలీ నిర్వహించిన విద్యార్థులు, కాలేజీ యాజమాన్యం

వినాయక చౌరస్తాలో నిరసన తెలుపుతున్న విద్యార్థులు, కాలేజీల యాజమాన్యాలు

భువనగిరి అర్బన్, అక్టోబర్ 17 : పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని కోరుతూ పట్టణంలోని ప్రైవేటు జూనియర్, డిగ్రీ కళాశాలల యాజమాన్యం, విద్యార్థుల నిరసన గురువారం నాలుగో రోజూ కొనసాగింది. ఈ సందర్భంగా పట్టణంలో విద్యార్థులు, కాలేజీ మజమానులు నల్లబ్యాడ్జీలు ధరించి బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వినాయక చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా నవభారత్ కళాశాల ప్రిన్సిపాల్ చిక్క ప్రభాకర్ మాట్లాడుతూ కళాశాలల నిర్వహణ కష్టంగా మారిందని, ఉపాధ్యాయుల వేతనాలు చెల్లించలేక అప్పుల బాధను భరించలేక కళాశాలలను బంద్ చేయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. విద్యార్థులకు వచ్చే ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రైవేటు జూనియర్, డిగ్రీ కళాశాలల యాజమాన్యం సింగనబోయిన మల్లేశం, ప్రవీణ్‌కుమార్, మదిర మల్లేశం, సోను, వెంకన్న, శ్రవణ్, మహేందర్ పాల్గొన్నారు.

ఆర్‌పీలకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి : సీఐటీయూ

ఆర్‌పీల సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు మధు

భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 17 : మెప్మా రిసోర్స్ పర్సన్లకు పెండింగులో ఉన్న ఆరు నెలల వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు మంచాల మధు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీలో గురువారం ఆర్‌పీలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్‌పీలతో అనేక పనులు చేయించుకుంటూ ఆరు నెలల నుంచి వేతనాలు ఇవ్వడం లేదన్నారు. ప్రస్తుతం వారికి తక్కువ వేతనం ఇస్తున్నారని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. 8గంటల పని విధానాన్ని అమలు చేయాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలను కల్పించాలని కోరారు. కనీస వేతనం అమలు చేసి ఐడీ కార్డులు ఇచ్చి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం నాయకులు రామసాని వసంత, పద్మ, అనూరాధ, పద్మజ, చంద్రిక, చంద్రకళ, సుజాత, సురేఖ, సంతోష, రమ్య పాల్గొన్నారు.

బొలేరో ఢీకొని ఇద్దరు విద్యార్థులకు తీవ్రగాయాలు

వలిగొండ, అక్టోబర్ 17 : మండల కేంద్రంలో బొలేరో ఢీకొని ఇద్దరు విద్యార్థులకు గాయాలయ్యాయి. మండలంలోని లోతుకుంట గ్రామ పరిధిలోని మోడల్ స్కూల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న అజీముద్దీన్, 10వ తరగతి చదువుతున్న నజీముద్దీన్ గురువారం సాయంత్రం స్కూల్ వదిలిన తర్వాత ఇంటికి వస్తుండగా వలిగొండ – తొర్రూరు చౌరస్తా వద్ద అతివేగంగా వచ్చిన బొలేరో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల సమాచారంతో 108 సిబ్బంది వచ్చి అంబులెన్స్‌లో భువనగిరి ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

గీత వృత్తిదారులను ఆదుకుంటాం

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

గీత కార్మికులకు సేఫ్టీ మోకు అందజేస్తున్న ప్రభుత్వ విప్ ఐలయ్య

ఆలేరు టౌన్, అక్టోబర్ 17 : కాటమయ్య రక్షణ కవచాలను అందించి గౌడ కుల వృత్తిదారులను ఆదుకుంటామని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. ఆలేరులోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో గురువారం గీత వృత్తిదారులకు కాటమయ్య రక్షణ కవచాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌడన్నలు తాటి చెట్టు ఎక్కుతున్న క్రమంలో ప్రమాదాలకు గురికాకుండా ప్రభుత్వం కాటమయ్య రక్షణ కవచం అందజేస్తుందన్నారు. నియోజకవర్గంలో శిక్షణ పూర్తి చేసుకున్న 200 మంది గీత కార్మికులకు సేఫ్టీ కిట్స్ అందించామని తెలిపారు. జిల్లాలో 17వేల మంది గీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారని, వారందరికీ దశల వారీగా శిక్షణ ఇచ్చి రక్షణ కవచాలు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్, ఆర్డీఓ గంగాధర్, బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి యాదయ్య, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సైదులు, సీఐలు పాల్గొన్నారు.

రక్షణ కవచాల పంపిణీలో తోపులాట

నియోజకవర్గ వ్యాప్తంగా గౌడన్నలకు రక్షణ కవచాల పంపిణీని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించడంతో సరిపోక తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఎక్సైజ్ సీఐ మొదటగా ఆలేరు మండలాన్ని పిలువకుండా యాదగిరిగుట్ట గౌడన్నలను పిలువడంతో స్థానిక గీత కార్మికులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ సైదులు మండలాల వారీగా పేర్లు చదువుతుండగా ఒక్కసారిగా రావడంతో సభకు భంగం వాటిల్లింది. ఈ సందర్భంగా తోపులాట జరిగింది.

రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరించాలి

రైతులకు ఇబ్బందులు కలుగకుండా ధాన్యం సేకరణ చేపట్టాలని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రైతులు పండించిన ధాన్యం దళారులకు అమ్ముకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో మొత్తం 370 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. దొడ్డు రకం వడ్లకు 233, సన్న ధాన్యం కొనుగోలు కోసం 47 సెంటర్లను ఏర్పాటు చేశామని చెప్పారు. రైతులు దళారులకు అమ్మకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని సూచించారు. సన్న వడ్లకు మద్దతు ధర రూ.2,320తోపాటు రాష్ట్ర ప్రభుత్వం రూ.500 బోనస్ చెల్లిస్తుందని, ధాన్యం కొన్న మూడ్రోజుల్లోనే రైతు ఖాతాలో డబ్బులు వేస్తామని తెలిపారు. సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్, ఆర్డీఓ గంగాధర్, వ్యవసాయ అధికారులు, ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ ఐనాల చైతన్యరెడ్డి, వైస్ చైర్మన్ మదార్‌గౌడ్ పాల్గొన్నారు.

వాల్మీకి జీవితం స్ఫూర్తిదాయకం : కలెక్టర్ జెండగే

కలెక్టరేట్‌లో వాల్మీకి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న కలెక్టర్ హనుమంతు కె.జెండగే, అధికారులు

భువనగిరి కలెక్టరేట్, అక్టోబర్ 17 : ఆది కవి మహర్షి వాల్మీకి జీవిత చరిత్ర తెలుసుకుని నేటి తరం ఆయన స్ఫూర్తితో ముందుకెళ్లాలని కలెక్టర్ హనుమంతు కె.జెండగే అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో గురువారం వాల్మీకి జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి కలెక్టర్, అధికారులు నివాళులర్పించి మాట్లాడారు. రామాయణం చదివినప్పుడల్లా అందరికీ ఆది కవి వాల్మీకి గుర్తుకొస్తారన్నారు. ప్రతిఒక్కరూ అనుసరించవలసిన ఆదర్శ కావ్యం రామాయణమని, అలాంటి రామాయణాన్ని రచించిన వాల్మీకి జీవిత చరిత్రను తెలుసుకోవడం ద్వారా స్ఫూర్తిని పొంది, ఆయన మార్గంలో పయనించి అనుకున్న లక్ష్యాలను సాధించాలని సూచించారు. రామాయణంలో మానవ విలువల గురించి, మనిషి ఎలా ఉండాలో తెలియజేసిన వాల్మీకి అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. రోజూ మనం చేసే పనుల్లో మంచి, చెడును గ్రహించి మానవతా దృక్పథం కలిగి ఉండాలని, ప్రతి పనిని అంకితభావంతో చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు గంగాధర్, బెన్‌షాలోమ్, డీఆర్డీఓ నాగిరెడ్డి, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి యాదయ్య, కలెక్టరేట్ ఏఓ జగన్మోహన్‌ప్రసాద్, వాల్మీకి బోయ కమ్యూనిటీ జిల్లా ప్రెసిడెంట్ రాజయ్య, కమ్యూనిటీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లావ్యాప్తంగా వాల్మీకి జయంతి

ఆలేరు రూరల్/ రాజాపేట/ రామన్నపేట/ మోత్కూరు/ సంస్థాన్ నారాయణపురం/ బొమ్మలరామారం/ చౌటుప్పల్ రూరల్ : జిల్లా వ్యాప్తంగా ఆది కవి వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాల్లో ఆయా శాఖల అధికారులు, సిబ్బంది వాల్మీకి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆలేరు, రాజాపేట, రామన్నపేట, సంస్థాన్ నారాయణపురం, మోత్కూరు, బొమ్మలరామారం మండల పరిషత్ కార్యాలయాల్లో, చౌటుప్పల్ మున్సిపల్ కార్యాలయంలో వాల్మీకి జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఎంపీడీఓలు, మండల అధికారులు నివాళులర్పించారు.

పంట రుణాల కోసం 25లోగా దరఖాస్తు చేసుకోవాలి

మోత్కూరు, అక్టోబర్ 17 : మోత్కూరు రైతు సేవా సహకార సంఘం పరిధిలోని రైతులు పంట రుణాల కోసం ఈ నెల 25లోగా దరఖాస్తులు చేసుకోవాలని సంఘం చైర్మన్ పేలపుడి వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో సూచించారు. సంఘం ద్వారా రైతులకు రుణాలు అందించేందుకు డీసీసీబీ రూ.50లక్షల మంజూరుకు ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. సంఘం పరిధిలోని నూతన షాపింగ్ కాంప్లెక్స్‌లో మడిగెలు అద్దెకు ఇచ్చేందుకు సంఘం తీర్మానం చేసిందని పేర్కొన్నారు. ఒక్కో మడిగెకు నెలకు రూ.6వేల చొప్పున అద్దె ఇవ్వడంతోపాటు రెండు సంవత్సరాల కాలపరిమితికి రూ.30వేలు అడ్వాన్స్ చెల్లించాలని సూచించారు. మోత్కూరు, పొడిచేడు, అనాజిపురం, రహీంఖాన్‌పేట్, ఖప్రాయపల్లి, దత్తప్పగూడెంలో సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం కోసం చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. రైతులు దళారులకు ధాన్యం అమ్మి మోసపోవద్దని, ప్రభుత్వ కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు.

లైంగిక దాడులను అరికట్టడంలో ప్రభుత్వం విఫలం : ఐద్వా

చౌటుప్పల్ రూరల్, అక్టోబర్ 17 : రాష్ట్రంలో మహిళలపై లైంగిక దాడులను అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఐద్వా జిల్లా కార్యదర్శి బట్టుపల్లి అనూరాధ అన్నారు. పట్టణంలోని రంగారెడ్డి స్మారక కార్యాలయంలో గురువారం జరిగిన సంఘం సమావేశంలో ఆమె మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యంతో మహిళలపై దాడులు పెరిగాయన్నారు. అనంతరం ఐద్వా మండల అధ్యక్షురాలిగా చింతకింది శారద, కార్యదర్శిగా ఎండీ రేష్మను ఎన్నుకున్నారు.

'దేవాలయ అభివృద్ధికి కృషి'

చౌటుప్పల్ రూరల్, అక్టోబర్ 17 : పట్టణంలోని కంఠమహేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తానని మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు అన్నారు. పట్టణంలోని 14వ వార్డులో దేవాలయం చుట్టూ సీసీ రోడ్డు నిర్మాణానికి గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో దేవాలయ అధ్యక్షుడు చింతకింది అంజయ్య, సందగళ్ల విజయసతీశ్, మురళి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ట్రాక్టర్ బ్యాటరీ చోరీ

వలిగొండ, అక్టోబర్ 17 : ఇంటి ముందు నిలిపిన ట్రాక్టర్ నుంచి బ్యాటరీ చోరీకి గురైంది. ఈ ఘటన మండలంలోని ముద్దాపురం గ్రామంలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముద్దాపురం గ్రామానికి చెందిన రైతులు సోలిపురం నర్సిరెడ్డి, సూదిరెడ్డి నర్సిరెడ్డికి చెందిన ట్రాక్టర్‌ను ఇంటి ముందు నిలిపారు. గురువారం ఉదయం చూడగా.. బ్యాటరీ లేదు. చుట్టుపక్కల ఎక్కడ వెతికినా కనిపించకపోవడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ యుగంధర్ తెలిపారు.

చిన్నకొండూరులో బెల్టుషాపు సీజ్

చౌటుప్పల్ రూరల్ : పట్టణంలోని చిన్నకొండూరు గ్రామంలో నిర్వహిస్తున్న బెల్టుషాపును పోలీసులు గురువారం సీజ్ చేశారు. బెల్టు షాపు నిర్వాహకుడు చిదుగుళ్ల బుచ్చయ్యను అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి పది బీర్లు, రెండు విస్కీ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

'ప్రజాభిప్రాయ సేకరణకు ఇంటిల్లిపాది తరలి రావాలి'


డిప్యూటీ తాల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ నాయకులు

రామన్నపేట, అక్టోబర్ 17 : అదానీ గ్రూప్ అంబుజా సిమెంట్ కంపెనీ ఏర్పాటుపై మండల కేంద్రంలో ఈ నెల 23న నిర్వహించనున్న ప్రజాభిప్రాయ సేకరణకు ఇంటిల్లిపాదిగా తరలివచ్చి ముక్తకంఠంతో వ్యతిరేకించాలని ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు పిలుపునిచ్చారు. ప్రజల ఆరోగ్యాలకు ప్రమాదం కలిగించే అంబుజా సిమెంట్ కంపెనీ ఏర్పాటుకు అనుమతులు ఇవ్వకూడదని గురువారం డిప్యూటీ తాల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిమెంట్ కంపెనీ ఏర్పాటు వల్ల శబ్ద, వాయు, జల కాలుష్యంతోపాటు చర్మ, ఊపిరితిత్తుల, శ్వాసకోశ, క్యాన్సర్ ఇతర వ్యాధులతో ఆక్సిజన్ తీసుకోలేని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. పచ్చని పంట పొలాలు బీడు భూములుగా మారే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ప్రజలు ఐక్యంగా ఉద్యమించకుంటే మనకు, మన భవిష్యత్ తరాలకు అంధకారం మిగులనుందని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ రేహాన్, ఎండీ జమీరొద్దీన్, మీర్జా ఫజల్‌బేగ్, ఎండీ అక్రం, మీర్జా బషీర్‌బేగ్, ఎంఏ వాహెద్, ఎండీ నాసర్, మన్సూర్ అలీ, షబ్బీర్, మీర్జా ఇనాయత్ బేగ్, ఎస్కే చాంద్, జానీ, ఎండీ రహీం, ఎండీ తాహెర్, మహబూబ్ అలీ, మీర్జా మజీద్‌బేగ్, ఆరీఫ్, కరీం, రిజ్వాన్, బాసిత్, అజీమ్, మన్నాన్ పాల్గొన్నారు.

'విద్యార్థిని కొట్టిన ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి'

ప్రిన్సిపాల్ మోహన్‌రెడ్డిని నిలదీస్తున్న విద్యార్థి బంధువులు

భువనగిరి అర్బన్, అక్టోబర్ 17 : విద్యార్థిని కొట్టిన ప్రైవేటు ఐటీఐ ప్రిన్సిపాల్ మోహన్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా నాయకుడు కొడారి వెంకటేశ్ అన్నారు. మోత్కూరుకు చెందిన పొన్నెబోయిన శివకుమార్ పట్టణంలోని సిద్ధార్థ ఐటీఐలో డీజిల్ మెకానిక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. పదో తరగతి లాంగ్ మెమో తీసుకురాలేదని ప్రిన్సిపాల్ మోహన్‌రెడ్డి ఇష్టానుసారంగా కొట్టాడు. విద్యార్థి ఫిర్యాదు మేరకు కుటుంబ సభ్యులు, వెంకటేశ్ గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రిన్సిపాల్ మోహన్‌రెడ్డి విద్యార్థులను విద్యార్థుల పట్ల కళాశాల యాజమాన్యం దురుసుగా ప్రవర్తించడం సరికాదన్నారు. విద్యార్థిని మానసికంగా, శారీరకంగా గాయపరచడాన్ని ఖండిస్తున్నామని తెలిపారు. అనంతరం విద్యార్థి తల్లిదండ్రులు, బంధువులు ప్రిన్సిపాల్‌ను నిలదీశారు. పదో తరగతి మెమో తేవాలని చెప్పగా.. సరైన సమాధానం చెప్పకపోవడంతో చేతితో కొట్టానని, దాంతో వాపు వచ్చిందని ప్రిన్సిపాల్ మోహన్‌రెడ్డి చెప్పాడు. ఇలాంటి చర్యలు పునరావృతం కావని తల్లిదండ్రులకు సర్ది చెప్పడంతో వారు శాంతించారు.

పల్లెర్ల చెరువులో చేప పిల్లలు విడుదల

పల్లెర్ల చెరువులో చేప పిల్లలు వదులుతున్న జిల్లా మత్స్యశాఖ అధికారి రాజారాం

ఆత్మకూరు(ఎం), అక్టోబర్ 17 : ప్రభుత్వం అందజేసిన 95వేల చేప పిల్లలను జిల్లా మత్స్యశాఖ అధికారి రాజారాం మండలంలోని పల్లెర్ల చెరువులో గురువారం వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్య కార్మికుల ఆర్థిక అభ్యున్నతి కోసం ప్రభుత్వం పాటుపడుతుందన్నారు. ఇలాంటి అవకాశాన్ని వినియోగించుకొని మత్స్యకారులు ఆర్థికంగా ఎదుగాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తండ మంగమ్మ, మాజీ జడ్పీటీసీ కె.నరేందర్‌గుప్తా, మాజీ ఎంపీటీసీ మల్లారెడ్డి, గ్రామ ప్రత్యేకాధికారి లోకేశ్వర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి నరేశ్, ఏఈఓ సరిత, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు వెంకటేశ్ పాల్గొన్నారు.

వలిగొండ : అక్కాచెల్లెల చెరువులో చేప పిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

మత్స్యకారుల అభ్యున్నతే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

- భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

బీబీనగర్/ వలిగొండ, అక్టోబర్ 17 : మత్స్యకారుల ఆర్థిక అభ్యున్నతే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం మత్స్యకారులకు అందజేస్తున్న ఉచిత చేప పిల్లలను బీబీనగర్ మండల కేంద్రంలోని పెద్ద చెరువులో గురువారం రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్‌తో కలిసి వదిలారు. అదేవిధంగా వలిగొండ మండల కేంద్రంలోని అక్కాచెల్లెల చెరువులో లక్షా 50వేల చేప పిల్లలను సంఘం సభ్యులతో కలిసి వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, అన్ని చెరువుల్లో ఉచిత చేప పిల్లలు వదులుతామని అన్నారు. ఔటర్ రింగ్‌రోడ్డు ఎంత అభివృద్ధి చెందుతుందో మూసీ నదిని ప్రక్షాళన చేస్తే హైదరాబాద్ ఇంకా వేగంగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. బునాదిగాని కాల్వ అభివృద్ధికి ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిశానని, త్వరలోనే నిధులు మంజూరవుతాయని తెలిపారు. మూసీ నదిని ప్రక్షాళన చేసి ఉమ్మడి నల్లగొండ జిల్లా రైతులకు, ప్రజలకు కాలుష్య రహిత నీటిని అందించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. మూసీ ప్రక్షాళనకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమాల్లో జడ్పీ సీఈఓ శోభారాణి, మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మీనారాయణ, ఏడీ రాజారాం, ఎంపీడీఓ జితేందర్, ఏఓ అంజనీదేవి, నాయకులు గోలి పింగళ్‌రెడ్డి, పొటోళ్ల శ్యామ్‌గౌడ్, నరేందర్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

పలు కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే కిశోర్ పరామర్శ

చిర్రగూడూరులో కనకయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిశోర్‌కుమార్

అడ్డగూడూరు, అక్టోబర్ 17 : మండలంలోని పలు కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ గురువారం పరామర్శించారు. మండల కేంద్రంలోని మాజీ సర్పంచ్ బాలెంల త్రివేణి దుర్గయ్య మాతృమూర్తి ఐలమ్మ చిత్రపటానికి, చిర్రగూడూరులో బీఆర్‌ఎస్ నాయకుడు శ్రీరాముల కనకయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం కల్పించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ దర్శనాల అంజయ్య, మాజీ జడ్పీటీసీ శ్రీరాముల జ్యోతీఅయోధ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మహేందర్‌నాథ్, నాయకులు రఘునందన్‌రెడ్డి, సతీశ్, జనార్దన్‌రెడ్డి ఉన్నారు.

కాళేశ్వరం జలాలు అందిస్తే స్వాగతిస్తాం : బీఆర్‌ఎస్

రాజాపేట, అక్టోబర్ 17 : రాజాపేట మండలానికి మూడు నెలల్లో కాళేశ్వరం సాగు నీరు అందిస్తే స్వాగతిస్తామని బీఆర్‌ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు సట్టు తిరుమలేశ్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి మండలానికి సాగు జలాలు అందించేందుకు ఎనలేని కృషి చేశారన్నారు. 15వ ప్యాకేజీ ద్వారా మండలంలోని గొలుసుకట్టు చెరువులు నింపేందుకు రూ.12 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. ఆ నిధులతో కొంత మేరకు కాల్వ పనులు అయ్యాయని, ప్రస్తుత ఎమ్మెల్యే ఐలయ్య చొరవ తీసుకొని మిగతా పనులను పూర్తి చేయించి గొలుసుకట్టు చెరువులు నింపాలని కోరారు. సొంత నిధులతో కాల్వ పనులు చేపడుతామని స్థానిక ఎమ్మెల్యే చెప్పడం హర్షణీయమన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి కరువు నేలను తడిపి రైతుల పక్షాన నిలబడితే ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య చిత్రపటానికి బీఆర్‌ఎస్ పార్టీ తరఫున క్షీరాభిషేకం చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు చింతలపూరి వెంకట్‌రాంరెడ్డి, గుంటి మధుసూదన్‌రెడ్డి, సందిల భాస్కర్‌గౌడ్, గుర్రం నర్సింహులు, వీరేశం, రాజు, జశ్వంత్, ఉప్పలయ్యగౌడ్, సుదర్శన్, నర్సిరెడ్డి, రాజిరెడ్డి, లక్ష్మణ్‌నాయక్, బాబు, సురేశ్, గణేశ్ పాల్గొన్నారు.

వాటర్‌మెన్లకు శిక్షణ

శిక్షణలో మాట్లాడుతున్న జడ్పీ సీఈఓ శోభారాణి

బీబీనగర్, అక్టోబర్ 17 : గ్రామ మంచినీటి సరఫరా శిక్షణలో భాగంగా రెండో రోజు గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో వాటర్ మెన్లకు శిక్షణ కొనసాగింది. ఈ సందర్భంగా ట్యాంక్ క్లీనింగ్, ట్యాంకులో బ్లీచింగ్ పౌడర్ కలిపే విధానం, నీరు శుద్ధి చేసే విధానం, నీటిని వదిలే ముందు తీసుకోవలసిన జాగ్రత్తలు, శుద్ధి చేయబడిన నీరు నది నుంచి మన ఊరిలోని ట్యాంక్ వరకు ఎలా చేరుతుందో వివరించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ శోభారాణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కృష్ణయ్య, డీఈఈ ప్రశాంత్‌కుమార్, ఏఈఈ రవికిరణ్, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి : సీపీఎం

కూరెళ్ల కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు(ఎం), అక్టోబర్ 17 : మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించి ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని సీపీఎం మండల కార్యదర్శి వేముల భిక్షం అన్నారు. మండలంలోని కూరెళ్ల గ్రామంలో కొనుగోలు కేంద్రంలో రైతులు పోసిన ధాన్యం రాశులను గురువారం పరిశీలించి మాట్లాడారు. మండలంలో రైతులంతా పంటలు కోసి ధాన్యం అమ్ముకునేందుకు సిద్ధంగా ఉన్నారని, ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడంతో దళారులకు అమ్ముకొని మోసపోతున్నారని అన్నారు. క్వింటాకు రూ.500 బోనస్ చెల్లించి హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం గ్రామ శాఖ కార్యదర్శి తుమ్మలగూడెం యాదయ్య, నాయకులు మల్లయ్య, బుగ్గయ్య, సత్తయ్య, సోమయ్య, ఉప్పలయ్య పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి : సీపీఐ

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి సత్యనారాయణగౌడ్

మోటకొండూర్, అక్టోబర్ 17 : అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బొలగాని సత్యనారాయణగౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ సర్కార్ పూర్తిగా విఫలమైందన్నారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీలకతీతంగా అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని, ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని అన్నారు. షరతులు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని, మండల కేంద్రంలో పత్తి, ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి గాదెగాని మాణిక్యం, నాయకులు ముస్కు పెంటారెడ్డి, శ్రీనివాస్, పాండు, రాధమ్మ, వెంకన్న, అశోక్, రాంరెడ్డి, రాజయ్య, యాదగిరి పాల్గొన్నారు.